క్లుప్తంగా

వీఆర్వోపై చర్యలు తీసుకోవాలి

పెళ్లకూరు : పునబాక వీఆర్వో సుధాకర్ అవినీతి, అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారించి తగిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘం నాయకుడు యాగాని బెన్నీ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం పలువురు సంఘం నాయకులతో కలిసి పెళ్లకూరు రెవెన్యూ కార్యాలయం వద్దకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ రెడ్డిపల్లి దొరస్వామికి గ్రామంలోని సర్వే నంబర్ 210/24లో 0.20 సెంట్లు, 360/19లో 0.08 సెంట్లు, 372/5బీలో 0.94 సెంట్లు భూమి ఉందని తెలిపారు. దాన్ని వీఆర్వో అదే ప్రాంతానికి చెందిన మరొకరి పేరుతో మార్చేశాడని ఆరోపించారు. దీనికి సంబంధించిన మ్యుటేషన్ చేయాలని గత పది నెలలుగా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నాడు. దీనిపై గ్రీవెన్స్‌లో తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. నాయకులు నాగయ్య, సునీల్, శ్రీధర్, మణి తెలిపారు.

కలువాయిలో కరెంట్ కష్టాలు

కలువాయి(సైదాపురం) : కలువాయి మండలంలో కరెంట్ కష్టాలు తప్పడంలేదు. 33 కేవీ విద్యుత్ లైన్‌కి ఇన్సులేటర్ ఎరెక్షన్ మార్చాలని ఏఈ జయకుమార్ తెలిపారు. ఇందులో భాగంగా శనివారం, సోమవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. మూడు రోజులుగా పనిచేస్తూనే ఉన్నారు. అయినప్పటికీ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుతూనే ఉంది. విద్యుత్ పోతూ, వస్తూ వుండడంతో టీవీలు, ఎలక్ట్రానిక్ వస్తువులు పనిచేయడంలేదని కలువాయి వాసులు వాపోతున్నారు.

చేజర్ల సాక్షి రిపోర్టర్ మృతి


రవీంద్రబాబు (ఫైల్)

కలువాయి(సైదాపురం) : చేజర్ల మండలం సాక్షి రిపోర్టర్‌గా పనిచేస్తున్న కలువాయి మండలం కుల్లూరు గ్రామానికి చెందిన తోట రవీంద్రబాబు (50) సోమవారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగంతో బాధపడుతున్నారు. సోమవారం వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన సుదీర్ఘకాలం వివిధ పత్రికల్లో పని చేశారు. రవీంద్రబాబు మృతదేహానికి కుల్లూరు గ్రామంలో తోటి జర్నలిస్టులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వాహనాల తనిఖీ


వాహనాల పత్రాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ

వెంకటగిరి రూరల్ : వాహనదారులు తప్పనిసరిగా వాహనాల సర్టిఫికెట్లు కలిగి ఉండాలని ఎస్‌ఐ సుబ్బారావు తెలిపారు. ఆయన సోమవారం పట్టణంలోని రాజావీధి, ఉత్తరపువీధి, తూర్పువీధిలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ధ్రువీకరణ పత్రాలు లేని 8 ద్విచక్ర వాహనాలు, ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ముందుగా గుర్తిస్తే క్యాన్సర్‌కు చెక్


క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

దక్కిలి: క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నయం చేయవచ్చని మండల వైద్యాధికారి బిందు ప్రియాంక తెలిపారు. తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో సోమవారం వెంబులూరు, నాగవోలు సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ పరీక్షలు చేసుకోవాలన్నారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే మందులతో నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు హరిత, పద్మావతి, కార్యదర్శులు హరనాథ్, దేవకుమార్, నాగేశ్వరావు, వైద్య సిబ్బంది ఆదిలక్ష్మీ, రమణమ్మ, భారతి పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 10 మందికి గాయాలు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ముఖ్యంగా మార్కెట్ వీధి, బొమ్మిడికాలువ, వెలపాళెం, కుమ్మరిమిట్ట, బజారువీధి తదితర ప్రాంతాల్లో కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. సోమవారం 10 మందిని గాయపరిచాయి. వారు వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందారు. పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని పలుమార్లు కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

కోట: యువతి అదృశ్యంపై ఆమె కుటుంబ సభ్యులు సోమవారం ఎస్‌ఐ పవన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. విద్యానగర్ కొత్తపాళెం రోడ్డులో ఉంటున్న యువతి రెండురోజులుగా కనిపించడం లేదు. కుటుంబసభ్యులు బంధువులు, స్నేహితులు ఇళ్ల వద్ద గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొందరు తన కుమార్తెను అపహరించినట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఫోన్, సీసీ ఫుటేజీ ఆధారంగా యువతి అదృశ్యంపై విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కండలేరులో 43.197 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 43.197 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,100, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ఘాటు తగ్గిన మిర్చి



ఈ ఏడాది తగినంత వర్షం కురవకపోవడంతో మెట్ట ప్రాంత రైతులు మిర్చి సాగు చేశారు. దిగుబడి కూడా ఆశాజనకంగా వచ్చింది. మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడంతో గిట్టుబాటు ధర లభించలేదు. దీనికితోడు దళారులు తాము చెప్పిందే ధర అన్నట్టు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం మిర్చికి గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో ఏమి చేయాలో దిక్కుతోచక రైతులు వచ్చినకాడికి విక్రయించుకుంటున్నారు.

- దిగుబడి వచ్చినా గిట్టుబాటు ధర అందని వైనం
- లబోదిబోమంటున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

పెళ్లకూరు : మండలంలో ఎక్కువ మంది రైతులు వరిసాగు చేపడతారు. ఈ ఏడాది వర్షాభావం వల్ల పెళ్లకూరు మండలంలోని రోసనూరు, కాసూరు, పెన్నేపల్లి, కిష్టప్పకండ్రిగ, బంగారంపేట, రాజుపాళెం, తాళ్వాయిపాడు, శిరసనంబేడు, చావలి తదితర ప్రాంతాల్లో రైతులు సుమారు 5 వేల ఎకరాలకు పైగా మిర్చి సాగు చేపట్టారు. ప్రియాంక, ఇండాం5, నయనతార 525, ప్రావిజన్ 995 రకాల మిర్చి విత్తనాలను చిత్తూరు, ఒంగోలు, అనంతపురం ప్రాంతాల నుంచి కేజీ రూ.40 వేలకు కొనుగోలు చేసి సాగు చేశారు. పెట్టుబడికి తగినట్టు దిగుబడులు కూడా ఆశాజనకంగా రావడంతో రైతులు సంతోషించారు. ప్రారంభంలో పచ్చిమిర్చి కేజీ రూ.18ల నుంచి రూ.25లకు ఆగ్రా, ఢిల్లీ, చెన్నై ప్రాంతాలకు ఎగుమతి చేశారు. పంట దిగుబడి రోజు నుంచి 20 రోజులు గడిచేలోపు ధర బాగా తగ్గిపోయింది. కిలో రూ.10లకు పడిపోవడంతో కూలీలకు ఇచ్చే కూలి డబ్బులు గిట్టుబాటు రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఎండుమిర్చి ప్రారంభంలో కేజీ రూ.65 ఉండడం వల్ల భారీగా పెట్టుబడులు పెట్టిన మిర్చి రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు.

కోల్డ్ స్టోరేజ్‌కి కూటమి సెగ

స్థానికంగా పచ్చిమిర్చి విక్రయానికి మార్కెట్ సదుపాయం లేకపోవడంతో ఆగ్రా, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాలకు తరలించేవారు. ఎండుమిర్చిని నిల్వ చేసుకోవడానికి కోల్డ్ స్టోరేజీ భవనాన్ని గత జగన్ ప్రభుత్వంలో తాళ్వాయిపాడులో వైఎస్సార్ సీపీ నేత కట్టా బాలసుబ్రమణ్యం నిర్మించాడు. దాన్ని ప్రారంభించడంతో మండల రైతులు సంతోషం వ్యక్తం చేశారు. నియోజకవర్గానికి చెందిన కూటమి ముఖ్య నేత ఆగ్రహం వ్యక్తం చేయడంతో దాన్ని మూసివేయాల్సి వచ్చింది.

ధరలు లేక నష్టాలు వస్తున్నాయి



“ ఎండుమిర్చికి మార్కెట్‌లో గిట్టుబాటు ధర అందడం లేదు. నిల్వ చేసుకుని ధర వచ్చినప్పుడు విక్రయించుకుందామనుకుంటే కోల్డ్ స్టోరేజీలు లేవు. దీంతో నష్టాలు వచ్చినా తక్కువ ధరకే మిర్చిని విక్రయించాల్సి వస్తోంది. రైతుల సమస్యల గురించి పట్టించుకునే వారు లేరు. – రాఘవయ్య, నందిమాల

ప్రభుత్వం ఆదుకోవాలి



ఈ ఏడాది అధిక పెట్టుబడులు పెట్టి మిర్చి సాగు చేశాం. దిగుబడి కూడా బాగానే వచ్చింది. మార్కెట్‌లో ధరలు లేకపోవడంతో నష్ట పోయాము. ప్రభుత్వం మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించలేదు. తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. – కృష్ణారెడ్డి, పిడికిటిమాల

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ


ప్రమాదంలో దెబ్బతిన్న వాకాడు డిపో బస్సు

చిల్లకూరు : మండలంలోని కోట క్రాస్ రోడ్డు వద్ద సోమవారం రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొనడంతో ఆరుగురు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు–2 డిపోకి చెందిన నెల్లూరు– తిరుపతి నాన్‌స్టాప్ బస్సు ప్రయాణికులతో తిరుపతి వెళుతోంది. అదే సమయంలో వాకాడు డిపోకు చెందిన కోట –గూడూరు బస్సు కోట నుంచి గూడూరుకు వస్తోంది. కోట క్రాస్ రోడ్డు వద్ద మలుపు తిరుగుతున్న వాకాడు డిపో బస్సును నెల్లూరు డిపో బస్సు వెనక భాగంలో ఢీకొంది. ఈ ప్రమాదంలో వాకాడు డిపో బస్సులోని ఆరుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వారు ఆటోలో గూడూరు ఏరియా ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకుని వెళ్లిపోయారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాకాడు డిపో బస్సును పక్కకు తొలగించారు. నెల్లూరు డిపో బస్సును తిరుపతికి పంపించారు. గూడూరు డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి బస్సులోని ప్రయాణికులతో పాటు సిబ్బందికి సహాయ సహకారాలు అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

లీజు ముగిసిన గనులను స్వాధీనం చేసుకోవాలి


నెల్లూరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న శిరీష

సైదాపురం: మండలంలో లీజు ముగిసిన 8 గనులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర కృత్య అకాడమీ మాజీ చైర్ పర్సన్ పాట్నేళ్ల శిరీషాయాదవ్ కోరారు. ఆమె సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. సైదాపురంలో 50 ఏళ్ల లీజు ముగిసిన గనులు 8 ఉన్నాయని తెలిపారు. వాటిలో కూటమి నేతలు అనుమతి లేకుండా బ్లాస్టింగ్ చేసి ఖనిజాన్ని తరలిస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారని తెలిపారు. ఈ విషయం తెలిసినా రెవెన్యూ అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అక్రమ మైనింగ్‌పై జిల్లా మైనింగ్ అధికారికి ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీజు ముగిసిన గనులను స్వాధనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. లేనిపక్షంలో కోర్టును ఆశ్రయిస్తామన్నారు.

పేదలకు న్యాయం చేయాలని వినతి

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి మండలం కోటంబేడుకు చెందిన 70 మంది నిరుపేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వందవాసి నాగరాజు కోరారు. ఆయన సోమవారం తహసీల్దార్ విజయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కోటంబేడుకు చెందిన 70 మంది నిరుపేదలకు 1970లో అప్పటి ప్రభుత్వం సర్వే నంబర్లు 168, 200లో 84 ఎకరాల భూమి ఇచ్చినట్టు తెలిపారు. వారు వాటిలో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వాటికి పట్టాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆ భూమి అటవీ శాఖకు చెందినదని ఒకసారి, రెవెన్యూకు సంబంధించినదని ఒకసారి సాకులు చెబుతూ పేదలను ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. అధికారులు ఉమ్మడి సర్వే చేసి పేదలకు న్యాయం చేయాలని కోరారు.

పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం


సైదాపురంలో కురుస్తున్న వర్షం

దొరవారిసత్రం/సైదాపురం/రాపూరు/చిట్టమూరు : దొరవారిసత్రం, సైదాపురం, రాపూరు, చిట్టమూరు మండలాల్లో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. రోజంతా మేఘాలు కమ్ముకుని ఎండ కాయలేదు. దీంతో చల్లటి వాతవరణం నెలకొంది. భానుడి భగభగలతో అల్లాడిన ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు. వర్షానికి దొరవారిసత్రం మండలంలోని వెదురుపట్టు, తనియాలి, బూదూరు, కుప్పారెడ్డిపాళెం, ఏకొల్లు, లింగంపాడు, తల్లంపాడు తదితర ప్రాంతాల్లో ఎడగారు కింద వరినాట్లు వేసిన పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. చిట్టమూరు మండలంలోని గునపాడు, మెట్టు, గునపాటిపాళెం, తిమ్మారెడ్డి వాగు, ఎల్లసిరి, ఈశ్వరవాక, ఆలేటిపాడు, మన్నెమాల, జంగాలపల్లి గ్రామాల్లోని వరిమడుల్లో నీరు నిలిచింది. అదేవిధంగా నిమ్మ పంటకు కొంతమేర మేలు కలుగుతుందని సైదాపురం మండల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



దొరవారిసత్రం: వెదురుపట్టులోని వరిమడుల్లో నిలిచిన వర్షపు నీరు, రాపూరు : పెంచలకోనలో కురుస్తున్న వర్షం

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు


అర్జీలు స్వీకరిస్తున్న ఆరిశంకరయ్య

వెంకటగిరి రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నట్టు 14వ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ ఆర్టీఐ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఆరిశంకరయ్య తెలిపారు. ఆయన సోమవారం 14వ వార్డు సుదర్శన నగర్‌లో ప్రజల నుంచి అర్జీలు తీసుకుని అధికారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వార్డుల్లో పలు సమస్యలు నెలకొన్నాయని తెలిపారు. ప్రతి వారమూ ప్రజలు అర్జీలు ఇస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

ఉద్యాన పంటల సాగుకు దరఖాస్తులు

దక్కిలి: మండలంలోని రైతులు 2025–26 ఆర్థిక సంవత్సరానికి విస్తరణ పథకం కింద ఉద్యాన పంటలైన మామిడి, నిమ్మ, బొప్పాయి, జామ, డ్రాగన్ ఫ్రూట్, ఆయిల్ పామ్ సాగుకు సంబంధించి కొత్తగా సాగుకు దరఖాస్తు చేసుకోవాలని వెంకటగిరి ఉద్యాన శాఖ అధికారి ఆనంద్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, దరఖాస్తు తీసుకుని ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

22న పెంచలకోనలో హనుమజ్జయంతి

రాపూరు: పెంచలకోనలో 22న హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం 5 గంటలకు క్షేత్రపాలకుడైన ఆంజనేయ స్వామికి అభిషేకం, పూలంగిసేవ, 10.30 గంటలకు ఆకుపూజ, సాయంత్రం తిరుచ్చిపై ఆంజనేయస్వామి ఊరేగింపు ఉంటుందని తెలిపారు.

24న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

వెంకటగిరి (సైదాపురం) : వెంకటగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కాభానుప్రియ అధ్యక్షతన ఈ నెల 24న సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. 15వ ఆర్థిక సంఘం 2వ విడత నిధులతోపాటు పలు అంశాలపై చర్చ ఉంటుందని పేర్కొన్నారు. అధికారులు, కౌన్సిలర్లు, ఎక్స్ అఫిసియో మెంబర్లు తప్పక హాజరుకావాలని కోరారు.

ఘనంగా తిరంగా ర్యాలీ


పెళ్లకూరులో తిరంగా ర్యాలీ చేస్తున్న అధికారులు

పెళ్లకూరు: ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో సోమవారం తిరంగా ర్యాలీ చేపట్టినట్లు ఎంపీడీవో ప్రమీలారాణి, తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. పెళ్లకూరులో వివిధ శాఖల అధికారులు, నాయకులు కలిసి త్రివర్ణ పతాకాలను చేతబట్టి ప్రధాన వీధుల్లో ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో శంకరయ్య, డీటీ యువరాజ్, ఏఈలు మనోజ్‌కుమార్, వెంకటేష్ బీజేపీ మండల అధ్యక్షుడు నరసింహులు, మురళి పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులకు సర్వర్ కష్టాలు


కలువాయి సచివాలయం-2 వద్దకు వచ్చిన ప్రజలు

కలువాయి(సైదాపురం) : కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెళుతున్న ప్రజలకు సర్వర్ కష్టాలు తప్పడం లేదు. కొత్త రేషన్ కార్డులతోపాటు మార్పులు, చేర్పుల కోసం మే 7 నుంచి జూన్ 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రజలు పెద్ద సంఖ్యలో సచివాలయాలకు వస్తున్నారు. సర్వర్ పనిచేయకపోవడం, కంప్యూటర్లు మరమ్మతులకు గురవడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. సోమవారం కలువాయి సచివాలయం వద్దకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సాయంత్రం వరకు వేచి ఉన్నా సర్వర్ పనిచేయకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

ఆధార్ కేంద్రం మూసివేతపై నిరసన

కోట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రం మూసివేతపై సోమవారం పలువురు గ్రామస్తులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ మండలంలోని మారుమూల ప్రాంతాలు, గిరిజన కాలనీల్లోని ప్రజలు ఆధార్‌లో తప్పులు, ఇతర సమస్యల కారణంగా ప్రభుత్వ పథకాలు అందకుండా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఐటీడీఏ ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పది రోజులుగా కేంద్రాన్ని మూసేశారని తెలిపారు. చాలామంది ప్రజలు ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేసుకోవాల్సి ఉందని వాపోయారు. ప్రతిరోజూ ఆధార్ సేవల కోసం కేంద్రానికి వచ్చి వెనక్కి వెళుతున్నట్టు తెలిపారు.

వాహనాల తొలగింపు



గూడూరు రూరల్ : గూడూరు ఏరియా ఆస్పత్రిలో ప్రసూతి కేంద్రానికి వెళ్లే దారిలో అడ్డదిడ్డంగా పెట్టిన వాహనాలను సోమవారం సిబ్బంది తొలగించారు. ఆస్పత్రి ఆవరణలో ద్విచక్ర వాహనాలను ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయడం వల్ల తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్, 108 వాహనాలు ప్రసూతి కేంద్రం వద్దకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీనిపై అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్ అన్న శీర్షికన సాక్షి దినపత్రికలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆస్పత్రి సిబ్బంది వాహనాలను అక్కడ నుంచి తొలగించారు. ఇకమీదట అక్కడ వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకున్నట్టు అధికారులు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

ఎట్టకేలకు స్కానింగ్ మెషిన్‌కు మరమ్మతులు



చిల్లకూరు : గూడూరు ఏరియా ఆస్పత్రిలో ఉన్న సీటీ స్కానింగ్ మెషిన్‌కు ఎట్టకేలకు మరమ్మతులు చేయించారు. స్కానింగ్ మెషిన్ పనిచేయకపోవడంతో 15 రోజులుగా దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై పని చేయని స్కానింగ్ మెషిన్ అన్న శీర్షికన గురువారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురించింది. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ షరీనా స్పందించారు. మెషిన్‌కు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చారు. దీంతో దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి


గూడూరులో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

వెంకటగిరి రూరల్/చిల్లకూరు : కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయుడని సీపీఎం నాయకులు కొనియాడారు. వెంకటగిరి పట్టణంలోని కాశీపేట, గూడూరులోని సీపీఎం నాయకులు, ఆటో వర్కర్స్, సీఐటీయూ నాయకులు సోమవారం ఆయన వర్ధంతిని జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. గూడూరులో ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే చెన్నూరులో రక్తదాన శిబిరం నిర్వహించారు. సీపీఎం వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య, రాజయ్య, రత్నమ్మ, చిరంజీవి, ఎల్లమ్మ, చందు, గూడూరులో వందవాసి నాగరాజు, జోగి శివకుమార్, పుట్టా శంకరయ్య, బీవీ రమణయ్య, అడపాల ప్రసాద్, పామంజి మణి, దార కోటేశ్వరరావు, రమేష్, మున్నా, మౌలా, శ్రీనివాసులు, చంద్రయ్య, వెంకట్రావ్, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య


పోలీసు స్టేషన్ వద్ద మృతురాలి బంధువులు

పెళ్లకూరు: మండలంలోని పునబాక గ్రామంలో సోమవారం వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. పునబాక దళితకాలనీలో పైపూరి మురళి, స్వాతి(32) దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్వాతికి భర్తపై అనుమానం ఉంది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ జరుగుతోంది. సోమవారం ఉదయం మరోసారి గొడవ పడ్డారు. ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో స్వాతి(32) ఉరి వేసుకుంది. స్థానికులు గమనించి శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగరాజు కేసు నమోదు చేసి భర్త మురళిని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తల్లి మృతిచెందడంతో చిన్నారులు చాణిక్యవర్మ, రీతువర్మ రోదించడాన్ని చూసి స్థానికులు కంటతడి పెట్టారు.

మరమ్మతులకు గురైన బోరు



చిల్లకూరు : మండలంలోని తొణుకుమాల పంచాయతీలోని యోగీశ్వరపల్లి అంగన్‌వాడీ కేంద్రం తిక్కవరం రోడ్డు పక్కనే ఉంది. ఇక్కడి పిల్లలకు తాగునీరు అందించేందుకు గతంలో బోరు వేశారు. మూడు నెలల క్రితం అది మరమ్మతులకు గురైంది. దీంతో తాగునీటి కోసం పిల్లలు, అంగన్‌వాడీ సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆ బోరు సర్పంచ్ ఇంటికి ఎదురుగా ఉన్నా ఫలితం లేదు. బోరు మరమ్మతులకు గురైనట్టు ఎంపీడీవో కార్యాలయంలో తెలిపినా సరిచేస్తారని, సర్పంచ్ అది కూడా చేయడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరును బాగు చేయాలని కోరుతున్నారు.

కనుల పండువగా వసంతోత్సవం


తిరుమంజనం నిర్వహిస్తున్న వేదపండితులు

నాయుడుపేట టౌన్ : తుమ్మూరు గ్రామంలో జరుగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్య స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన సప్పరంపై స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి గ్రామంలో ఊరేగించారు. తదుపరి వసంతోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం చక్రస్నాన ఘట్టాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. రాత్రి ధ్వజావరోహణం చేశారు. ఉత్సవాల్లో చివరి రోజు మంగళవారం స్వామి, అమ్మవార్లకు పుష్పయాగాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకులు శేషాద్రి స్వామి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు సుధీర్, హరిరెడ్డి తెలిపారు.